ప్రసవాల్లో 'ఆదర్శం'


ప్రభుత్వాసుపత్రిలోని బాలింతల వార్డు

- ప్రభుత్వాసుపత్రిలో రికార్డుస్థాయిలో ప్రసవాలు
- 'ఆదర్శ'కాన్పుల వార్డుతో మెరుగైన సేవలు
- రాష్ట్రంలో 2వ స్థానం, జిల్లాలో మొదటి స్థానం

ఎమ్మిగనూరు రూరల్: ప్రభుత్వ లక్ష్యం.. ప్రజాచైతన్యం..ప్రభుత్వవైద్యుల సేవాతత్వం వెరసి ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. 'తల్లీబిడ్డలు సురక్షితం' నినాదం ఆచరణలో సాధ్యమవుతోంది. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'ఆదర్శ కాన్పుల వార్డు' అత్యుత్తమ ఫలితాలనిస్తోంది. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ప్రజలతోపాటు సి.బెళగల్, ఆస్పరి, దేవనకొండ ప్రాంతాల్లోని మెజార్టీ గ్రామాల ప్రజలకు ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాల విస్తృత వైద్యసేవలు అందిస్తోంది. ప్రారంభంలో 30 పడకల ఆసుపత్రిగా ఉన్నా.. 2002లో కమ్యూనిటీ ఆసుపత్రిగా నిర్మించి పడకల సంఖ్య పెంచారు. నేడు రూ. 12.60 కోట్లతో 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

రూ.2 కోట్లతో 'ఆదర్శ'కాన్పుల వార్డు

ఈప్రాంత ప్రజల ఆర్థిక అసమానతలను దృష్టిలో ఉంచుకొని యూనెసెఫ్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మిగనూరు వైద్యశాలలో 'ఆదర్శ'కాన్పుల వార్డును ఏర్పాటు చేశారు. రూ.2 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో వార్డులో సౌకర్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. నలుగురు గైనకాలజిస్టులు, 25 మంది స్టాఫ్ నర్సులను కేటాయించారు.

రికార్డుస్థాయిలో కాన్పులు

ఎమ్మిగనూరు వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది సేవాతత్వం..చురుకుదనం మూలంగా రికార్డు స్థాయిలో కాన్పులు నమోదు అవుతున్నాయి. నలుగురు గైనకాలజిస్టులకు గాను ఇద్దరు మాత్రమే ఉన్నారు. 19 మంది నర్సులు పనిచేస్తున్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందితోనే నెలకు 250 నుంచి 310 కి పైగా కాన్పులను చేస్తున్నారు. ప్రతిరోజూ గర్భిణులకు స్కానింగ్, రక్త పరీక్షలు, సాధారణ చెకప్‌లు చేస్తున్నారు. రికార్డుస్థాయిలో కాన్పులు చేపట్టి జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్ర స్థాయిలో 2 స్థానం సాధించారు.

గర్భిణులకు ఆర్థిక సాయం

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు చేయించుకుంటే వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. పీహెచ్‌సీలో 3 నెలల తరువాత పేరు నమోదు చేసుకుంటే 5వ నెలలో రూ.2 వేలు, ఆసుపత్రిలో ప్రసవం జరిగితే రూ..1000, ఏడాదిన్నరలో అన్ని వ్యాక్సిన్స్ వేయించుకుంటే రూ.2 వేలు నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారు. ఆరోగ్యశ్రీ ఆసరా కింద రూ.4 వేలు, జననీ సురక్ష యోజన కింద రూ.1000లు బాలింతకు అందజేస్తున్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు రూ.11 వేలు ప్రభుత్వం అందజేస్తుంది. తల్లిబిడ్డలను సురక్షితంగా తల్లిబిడ్డ వాహనంలో ఉచితంగా ఇంటికి చేరుస్తోంది.

ప్రసవాల సంఖ్య పెరుగుతోంది



ప్రభుత్వాసుపత్రికి ప్రసవాల కోసం వచ్చేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆదర్శ కాన్పుల వార్డు వచ్చినప్పటి నుంచి ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల నుంచి గర్భిణులు ప్రసవం కోసం వస్తున్నారు. నార్మల్ డెలివరీలతో పాటు అత్యవసరమైతే సిజేరియన్‌లు చేస్తున్నారు. ప్రతి నెల స్కానింగ్ పరీక్షలకు గర్భిణులు వందల సంఖ్యలో వస్తున్నారు. 100 పడకల ఆసుపత్రి త్వరగా నిర్మాణం జరిగితే మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంది. డాక్టర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. – డాక్టర్ మైత్రేయి, గైనకాలజిస్ట్, సూపరింటెండెంట్

సంవత్సరం	నార్మల్ డెలివరీ	సిజేరియన్	మొత్తం
2019	2,123	318	2,441
2020	2,507	420	2,927
2021	2,612	592	3,204
2022	2,642	521	3,164
2023	571	114	685



ఎమ్మిగనూరు కమ్యూనిటీ వైద్యశాల

14న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

తుగ్గలి: నులిపురుగుల నివారణకు ఈనెల14న మండలంలో 1 నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు పగిడిరాయి, తుగ్గలి పీహెచ్‌సీల వైద్యులు హరిత, ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు మింగడం వల్ల పిల్లల కడుపులోని నులి పురుగులు చనిపోతాయన్నారు. పగిడిరాయి పీహెచ్‌సీ పరిధిలో 5,783, తుగ్గలి పీహెచ్‌సీ పరిధిలో 7,500 మంది 19 ఏళ్లలోపు వారు ఉన్నారన్నారు.

ఉపాధి కూలీకి గాయాలు

మద్దికెర: మండల పరిధిలోని బొజ్జనాయునిపేట గ్రామానికి చెందిన ఉపాధి కూలీ లక్ష్మీదేవి శనివారం ఉదయం పని ప్రదేశంలో ఎండ వేడిమిని తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయింది. కిందపడటంతో చేయి విరిగింది. గమనించిన తోటి కూలీలు వెంటనే వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వెల్దుర్తి: విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా ఆదివారం సైతం అల్లుగుండు, బొమ్మిరెడ్డిపల్లె, మల్లెపల్లె, నార్లాపురంలలో శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాఘవేంద్ర తెలిపారు. వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 3 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు లాల్‌మాన్‌పల్లెలో ఇస్తెమా

కృష్ణగిరి: మండల పరిధిలోని లాల్‌మాన్‌పల్లె గ్రామంలో ఆదివారం ఇస్తెమా నిర్వహించనున్నట్లు ముస్లిం మత పెద్దలు మైదాన్, కాలెసాహెబ్, మదార్‌సాహెబ్, అల్లీసాహెబ్ శనివారం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి మత పెద్దలు వస్తున్నారని, వారి బోధనలు వినేందుకు మండల వ్యాప్తంగా ఉన్న ముస్లింలు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

భక్తితో పులకించిన పులిచెర్ల


పూజల్లో పాల్గొన్న భక్తులు

కృష్ణగిరి: విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలతో మండల పరిధిలోని పులిచెర్ల గ్రామం భక్తితో పులకించింది. శనివారం ఉదయం నూతనంగా నిర్మించిన శివాలయంలో వినాయకుడు, శివలింగాన్ని, శిఖర, నంది విగ్రహ ప్రతిష్ఠలతో పాటు నూతనంగా నిర్మించిన ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో స్వామికి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఇంటి ఆడబిడ్డలకు ఒడి బియ్యం పోశారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అశ్వ వాహనంపై ఊరేగిన శ్రీవారు


అశ్వవాహనంపై కొలువైనస్వామి వారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువైన రంగనాథుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరంగనాథుడు సతీసమేతుడై శనివారం అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తుల మధ్య పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేదమంత్రాలు చదువుతూ పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని అశ్వ వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న ఎల్లెల్సీ గట్లు


ఎల్లెల్సీ గట్టుపై వేసిన కోడి వ్యర్థాలు, జంతువుల కళేబరాలు

హొళగుంద: బళ్లారి రోడ్డులోని తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) గట్లు, పరిసరాలు డంపింగ్ యార్డును తలిపిస్తోన్నాయి. దీంతో నీరు కలుషితమై ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని గ్రామస్తులు వాపోతున్నారు. చికెన్ షాపు నిర్వాహకులు కొందరు కోళ్ల వ్యర్థాలను కాలువ గట్టుపై వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. పందులు, కుక్కల కళేబరాలను తెచ్చి కాలువ గట్టున వేస్తున్నారు. ఫలితంగా నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. ఇటీవల పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ పారిశుద్ధ్య పనులు చేయించారు. వ్యర్థాలను చెత్త సేకరణ కేంద్రంలో వేయాలని, కాలువ గట్టుపై పడేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా వారిలో మార్పు లేదు.


అంబులెన్స్‌లో ప్రసవం

- తల్లీబిడ్డ సురక్షితం


శిశువును చూపుతున్న అంబులెన్స్ సిబ్బంది

ఆలూరు రూరల్: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా ఆడ బిడ్డను ప్రసవించింది. మండల పరిధిలోని కరిడిగుడ్డం గ్రామానికి చెందిన గర్భిణి సుజాతకు శనివారం తెల్లవారు జామున నొప్పులు అధికం కావడంతో బంధువులు 108కు కాల్ చేశారు. అంబులెన్స్ అక్కడికి చేరుకుని గర్భిణిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది.తల్లీకూతురిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు 108 సిబ్బంది 108 సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన భీమేష్ ఆచారి

మంత్రాలయం రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మాధవరం గ్రామంలో చోటు చేసుకుంది. మాధవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయం గ్రామానికి చెందిన భీమేష్ బైక్‌పై గిల్కేసూగూరు నుంచి మంత్రాలయం వైపు వస్తుండగా.. మంత్రాలయం నుంచి రాయచూరుకు వెళ్తున్న కారును మాధవరం గ్రామ శివారులో మొదటి కల్వర్టు వద్ద బైక్ ఢీ కొట్టింది. దీంతో భీమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 ద్వారా ఎమ్మిగనూరుకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- ఆర్డీఓ మోహన్‌దాసు


పోలింగ్‌కేంద్రాల వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ మోహన్‌దాసు

పత్తికొండటౌన్: ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామని ఆర్డీఓ మోహన్‌దాసు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ శనివారం పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో 9,385 మంది పట్టభద్రులు, 430 మంది ఉపాధ్యాయులు, 144 మంది స్థానిక సంస్థల ప్రతినిధులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారన్నారు. వీరి కోసం పట్టభద్రులకు 10, ఉపాధ్యాయులకు 9, స్థానిక సంస్థల ఓటర్ల కోసం 1 చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో చిత్రీకరణ చేస్తామన్నారు. ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కటారుకొండ విద్యార్థినులు


విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

కృష్ణగిరి: తమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని మండల పరిధిలోని కటారుకొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందురెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థినులను పీఈటీ రామన్నతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 17, 18, 19 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగే 7వ ఆంధ్రప్రదేశ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థినులు శ్రావణిసంధ్య, పూజిత జిల్లా తరఫున పాల్గొననున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, ఉషారాణి, మారుతి ప్రియ, వెంకటరాముడు, నరేష్, ప్రసాద్, అయ్యన్న, మురళీకృష్ణ, బాలపుల్లయ్య, వెంకటరమణ, సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి భజన పోటీల విజేత కర్నూలు


మొదటి బహుమతి అందుకుంటున్న కర్నూలు భజన బృందం సభ్యులు

కృష్ణగిరి: మండల పరిధిలోని మన్నెకుంట గ్రామంలో సుంకులాపరమేశ్వరి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన రాష్ట్ర స్థాయి భజన పోటీల్లో కర్నూలుకు చెందిన శివ పంచాక్షరి భజన బృందం విజేతగా నిలిచింది. 14 భజనబృందాలు పాల్గొనగా కర్నూలు బృందం మొదటి స్థానంలో నిలిచి అర తులం బంగారం కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో వీరారెడ్డిపల్లె శ్రీరామ భజన బృందం నిలిచి 25 తులాల వెండిని దక్కించుకుంది. ఆ తరువాత స్థానాల్లో వరుసగా కడిమెట్ల, కందికాయపల్లె, అల్లీనగరం, పుల్లగుమ్మి, వేల్పమడుగు, కడమకుంట్ల, నాయకల్లు, గుత్తి ఆర్ ఎస్ బృందాలు నిలిచి రూ.14 వేలు, రూ.10,500, రూ.8,400, రూ.7,700, రూ.7వేలు, రూ. 6,300, రూ.5,600, రూ.3,500 చొప్పున గ్రామ చెన్నకేశవ భజన బృందం సభ్యులు, గ్రామస్తులు అందజేశారు.

అధిక మార్కులు సాధించి పేరు తీసుకురావాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన

వెల్దుర్తి: అధిక మార్కులు సాధించి స్కూల్‌కు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన విద్యార్థులకు సూచించారు. త్వరలో 10వ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురుకుల విద్యాలయంలో 'తల్లిదండ్రుల దీవెనలు' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లితండ్రులు హాజరై తమ పిల్లలను దీవించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటి వాతావరణం, తల్లితండ్రుల దీవెనలే విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. విద్యార్థులు అధిక మార్కులతో పాసవ్వాలన్న పట్టుదల, ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలు భక్తులతో సందడి నెలకున్నాయి. మండలంలోని సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి, అగసలదిన్నెలోని దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారం కావడంతో భక్తులు వందలాదిగా తరలివచ్చి దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు వాయుపుత్రుడుకి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. బుడుములదొడ్డిలో సీతారాములకు పూజల అనంతరం ఉత్సవమూర్తులకు రథోత్సవం జరిపించారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడా పూజలు జరిగాయి.

24న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం

వెల్దుర్తి: ఈనెల 24న విజయవాడలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేసేందుకు దళిత గిరిజనులు తరలిరావాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ కోరారు. శనివారం ఆయన స్థానిక సమితి నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వం విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో సమితి నాయకులు టైలర్ రాముడు, రాజేశ్, ఎల్లకృష్ణ, పుల్లయ్య, వెంకటేశ్, మధు, హనుమంతు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

హొళగుంద: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. శనివారం వారు హొళగుందలోని ఫిల్టర్‌బెడ్ వద్ద 10 హెచ్‌పీ, 20 హెచ్‌పీల మోటార్లకు మరమ్మతు పనులు, ఆయా వీధుల్లో పైప్‌లైన్ లీకేజీలు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. హొళగుంద మేజర్ పంచాయతీ కావడంతో తాగునీటి సరఫరాలో చిన్నచిన్న లోపాలు తలెత్తినా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

హొళగుంద: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ వందవాగిలి మల్లికార్జున సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ సొసైటీలో పొందిన దీర్ఘకాలిక, రైతు నేస్తం, రాజన్న చేయూత తదితర రుణాలను నెలాఖరులోపు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం


దాహం తీర్చుకుంటున్న యువకులు

వెల్దుర్తి: స్థానిక సీఐ యుగంధర్ తన కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వివిధ సమస్యలతో వచ్చే ప్రజలు చలివేంద్రం వద్ద దాహం తీర్చుకుంటున్నారు. ఎండలు మండిపోతుండటంతో దాహం వేసిన వారికి చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని పలువురు సీఐకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

హొళగుంద బస్టాండ్‌లో..


హొళగుంద బస్టాండులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హొళగుంద: ఉపాధ్యాయుడిగా పని చేస్తూ కొన్నేళ్ల క్రితం మరణించిన చిన్నహ్యాట కురువ బీరప్ప జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు స్థానిక బస్టాండులో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, కురువ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, గౌరవాధ్యక్షుడు కాళికప్రసాద్, ఎంపీటీసీ శివన్న తదితరులు పాల్గొన్నారు.

కారు–ఆటో ఢీ

- భార్యాభర్తలకు గాయాలు


చికిత్స పొందుతున్న షేక్షావలి

ఎమ్మిగనూరు రూరల్: పట్టణ సమీపంలో అగ్నిమాపక కేంద్రం సమీపంలో శనివారం ఆటో–కారు ఢీ కొనటంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు... ఆదోనికి చెందిన షేక్షావలి, మాబీ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి సొంత ఆటోలో కలుగొట్లకు బయలుదేరారు. ఎమ్మిగనూరు సమీపంలోకి రాగానే ఆటో ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో షేక్షావలికి కాలు విరిగింది. మాబీకి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ప్రయాణం.. ఇక సులభం



అధ్వాన్నంగా ఉన్న కోగిలతోట రోడ్డు(ఫైల్),



తారు రోడ్డు వేసిన దృశ్యం

హొళగుంద: మండల కేంద్రానికి మారుమూలన ఉండి నాడు మరమ్మతుకు నోచుకోక అధ్వాన్నంగా ఉన్న కోగిలతోట రోడ్డు నేడు రూపు రేఖలు మారిపోయాయి. అడుగడుగునా గతుకులు, గుంతలతో ఉన్న కోగిలతోట 5 కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్డును బ్యాంక్ గ్యారెంటీ లోన్ రూ.1.85 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. తారు రోడ్డు పనులు వేగంగా జరుగుతూ ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నెల 17న కోగిలతోట గ్రామంలో సుంకలమ్మ, మారెమ్మ దేవిల మేటి కుంభోత్సవం ఉంది. అంతలోపు పనులు పూర్తవుతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భానుడి భగభగలు

- వేసవి ప్రారంభంలో మండుతున్న ఎండలు
- శీతల పానియాలకు పెరిగిన గిరాకీ


పుచ్చకాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: వేసవి ప్రారంభంలోనే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండల భగభగలతో జనం అల్లాడుతున్నారు. ఆలూరు ప్రాంతంలో రెండు వారాల క్రితం 28 సెంటీ గ్రేడ్‌లు ఉన్న ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 36 డిగ్రీలకు చేరింది. దీంతో ప్రజలు శీతల పానియాల దుకాణాలు, కూల్ డ్రింగ్ షాపుల వైపు వెళ్తున్నారు. మధ్యాహ్నం 12 గంటలు దాటితే ప్రజలు బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. చెరకు రసం, పచ్చి టెంకాలయలు, పుచ్చకాయలు, కూల్ డ్రింక్ షాపులకు గిరాకీ పెరిగింది. ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలూరు సీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఎండలో తిరగొద్దని, తలనొప్పి, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర, కలవరింతలు, పూర్తి అపస్మారక స్థితి లాంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు.


చెరకు రసం తీసుకుంటున్న ప్రజలు

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. వేడి గాలికి గురికాకుడదు. నలుపు రంగు, మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. అవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదు. ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు. ఎండలో తిరిగి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు తీసుకోవాలి.
– లక్ష్మీనారాయణ, డాక్టర్, ఆలూరు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- తెలుపు రంగు పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలి
- తలకు టోపీ/తలపాగా/గొడుగు ధరించాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ, పచ్చి టెంకాయ, ఓఆర్ఎస్ నీటిని తాగాలి
- రోజుకు 5-6 లీటర్ల మంచి నీరు తీసుకోవాలి
- గర్భిణులు, చిన్నపిల్లలు ఎండ వేడిమి తగలకుండా చూసుకోవాలి

వడదెబ్బకు గురైనప్పుడు..

వడదెబ్బకు గురైన వారిని నీడలో పడుకోబెట్టాలి. గాలి తగిలేలా చూడాలి. దుస్తులు వదులుగా చేయాలి. తడి గుడ్డతో శరీరమంతా తుడుస్తూ ఉండాలి. సాధారణ స్థితికి రాకపోతే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లాలి.